క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

వెల్దుర్తి : మండల పరిధిలోని మండాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ హరిబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించటం వలన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

దాచేపల్లి : నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని వడియరాజుల కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరగనున్నది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

800 మంది స్వాములు అయ్యప్ప మాలధారణ



పిడుగురాళ్లరూరల్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్థానిక అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. మండలంలోని అయ్యప్ప నగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప దేవాలయంలో ఒకే రోజులో విశేషంగా సుమారు 800 మంది భక్తులు ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్ శర్మ చేతుల మీదుగా మాలధారణ చేశారు. ఆలయం నిర్మించి 20 సంవత్సరాలు అయినా ఒకే రోజు 800 మంది భక్తులు మాలధారణ చేయడం ఇదే మొదటి సారి అని ఆలయ అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పిడుగురాళ్ల మండలం, పట్టణంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీవో టి.ప్రసన్నకుమారి బుధవారం తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్–2 జనరల్ కోటాలో ఒక అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు, పిడుగురాళ్ల మండలంలోని తుమ్మలచెరువు ఎస్టీ రిజర్వేషన్‌లో ఒకటి, ఇదే గ్రామంలో బీసీ మైనార్టీ బీసీఏ రిజర్వేషన్‌లో ఒకటి, గుత్తికొండ ఎస్సీ రిజర్వేషన్‌లో ఒకటి, పందిటివారిపాలెంలో బీసీ కాలనీలో జనరల్ కోటాలో అంగన్‌వాడీ సహాయకురాలు, చెన్నాయిపాలెం ఎస్సీ రిజర్వేషన్‌లో అంగన్‌వాడీ సహాయకురాలు, మాచవరం మండలం సింగరాయపాలెంలో ఎస్సీ రిజర్వేషన్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు 2023 జులై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు, 7వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. నవంబర్ 1వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, విద్యా అర్హత సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రం తదితరాలతో హాజరు కావాలని తెలిపారు.

వ్యాస రచన పోటీలకు విశేష స్పందన



సత్తెనపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పట్టణ సీఐ పి.ప్రభాకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో 'స్త్రీలు, పిల్లల లైంగిక వేధింపుల రక్షణ గురించి వివరించండి' అనే అంశంపై బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. 8, 9, 10 తరగతులకు చెందిన 43 మంది విద్యార్థులు వ్యాస రచన పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్‌ఐ బాలకృష్ణకు సత్కారం



సత్తెనపల్లి: సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహించి పలు దొంగతనాలు కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రస్తుత నకరికల్లు ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణను బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆదినారాయణ సత్కరించారు. సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలకు బాలకృష్ణ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా మెమెంటో,దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ సీఐ పీ ప్రభాకర్, సత్తెనపల్లి రూరల్ సీఐ పీ ప్రేమయ్య, పెదకూరపాడు సీఐ కె.వీరా స్వామి, అమరావతి సీఐ ఏపీ బ్రహ్మం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



విజయపురిసౌత్‌లో మహిళలకు హెల్త్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు



జగనన్న సురక్ష కిట్‌లను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విజయపురిసౌత్: ప్రజల ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజల ఆరోగ్యాన్ని ఆయన బాధ్యతగా తీసుకున్నారని మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లోని క్యాంప్–2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ప్రభుత్వం గ్రామాల్లోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు అందిస్తుందన్నారు. సీఎం జగన్ ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో వివిధ రకాల వంటలను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు హెల్త్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లు స్వామి, ఎంపీడీవో సరోజినిదేవి, ఈవో కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, జగనన్న సురక్ష కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ జయప్రకాష్‌రెడ్డి, తాళ్ళపల్లి, కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెస్లీ, ప్రవీణ్, ముక్తియర్ జాని, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మం నాయక్, బాలాజీనాయక్, వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

వెల్దుర్తి : ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలోనే ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రూప్లీ బాలునాయక్‌లు అన్నారు. బుధవారం మండలంలోని మిట్టమీదపల్లె పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని అన్ని వైద్యశాలల్లో ఉచితంగా పరీక్షలతోపాటు అన్ని రకాల జబ్బులకు సేవలందిస్తున్నారన్నారు. 463 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా ముగ్గురికి మెరుగైన చికిత్స నిమిత్తం రిఫర్ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు అంబటి వెంకటరమణ, బలిగొడుగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాగులునాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి అంకిరెడ్డి, నాగరాజు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావునాయక్, పంచాయతీ కార్యదర్శి మాచర్లయ్య, శిరిగిరిపాడు వైద్యశాల వైద్యులు ముఖర్జి, నిజాముద్దీన్, కేపీ చారి, తెరిస్సా, ఆశీర్వాదం, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజయపురిసౌత్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష

విజయపురిసౌత్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయపురిసౌత్ గ్రామ సచివాలయం -2 పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహిస్తున్నట్లు మాచర్ల ఎంపీడీవో సరోజినిదేవి బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జీవించాలి



వేపకంపల్లిలో గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ జయకుమార్

కారెంపూడి: పల్లెల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా కలసి మెలసి జీవించాలని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ కోరారు. మండలంలోని వేపకంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పల్లె నిద్ర సందర్భంగా గ్రామస్తుల సమావేశంలో సీఐ జయకుమార్ మాట్లాడుతూ కక్షలు కార్పణ్యాల వల్ల గ్రామాల్లో ప్రశాంతత దెబ్బతింటుందన్నారు. తర్వాత కేసులు కావడం ఆ కేసుల ప్రభావం జీవితాంతం కటుంబంపై ఉండడంతో పాటు పిల్లల చదువులు ఉద్యోగాలను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ఈ గ్రామం నాది అందరూ నా వాళ్లే అనుకుని ప్రేమ పూర్వక వాతావరణంలో జీవించాలని అప్పుడే ఉద్రిక్తతలు తగ్గుతాయన్నారు. కక్షలను పెంచే ద్వేషపూరిత ఆలోచనలు ఎవరూ చేయవద్దన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులకు తెలపాలని చట్ట పరిధిలో వాటిని పరిష్కరించుకోవాలని అంతే కాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇబ్బందుల పాలు కావద్దని సీఐ జయకుమార్ హితవు పలికారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర రెడ్డి ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సీఐ జయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి కుటుంబానికి పరామర్శ



కృష్ణారెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న బత్తుల దేవానంద్

గురజాల : టీడీపీ కార్యకర్తల చేతిలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కూనిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా కక్షలు ఉంటే ప్రజా క్షేత్రంలో చూసుకోవాలి కానీ ఈ విధంగా అతి కిరాతకంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. కృష్ణారెడ్డిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మాదాసు భాగ్యారావు, వెంకట్రావు తదితరులున్నారు.

పేకాటస్థావరంపై దాడి

నకరికల్లు: మండలంలోని కండ్లకుంట గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ బుధవారం తెలిపారు. కండ్లకుంట గ్రామశివారులో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.5,420 సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు,

వైభవంగా బతుకమ్మ వేడుకలు



స్థానిక కొండయ్యగుడి సెంటర్‌లో బతుకమ్మను పూజిస్తున్న మహిళలు

నకరికల్లు: విజయదశమి పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాల్లో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా మహిళలు బతుకమ్మను పదిరోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బతుకమ్మ గ్రామోత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. స్థానిక రంగాబొమ్మ సెంటర్‌లో యువతులు కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలు పెద్దసంఖ్యలో కోలాట ప్రదర్శనను తిలకించారు. స్థానిక కొండయ్యగుడి సెంటర్‌లో మహిళలు సామూహికంగా బతుకమ్మ పూజలు చేశారు. జ్యోతులు చేతపట్టి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలతో అలరించారు.

పత్తి, మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



నందిగామలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమారి

సత్తెనపల్లి: పత్తి, మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ బీవీ శివకుమారి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో పత్తి పంటను క్షేత్ర సందర్శనలో భాగంగా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ శివకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం బెట్ట వాతావరణ పరిస్థితుల కారణంగా పూత, పిందె రాలటం జరుగుతుందన్నారు. అక్కడక్కడ గులాబీ రంగు పురుగు కూడా ఉందని గుర్తించారు. నివారణకు బోరాక్స్ 300 గ్రాములు, 19.19.19.లేదా 17.17.17 లేదా మల్టీకె ఒక కేజీ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగును అదుపు చేయడానికి ఎకరాకు 10–20 లింగాకర్షణ బుట్టలు పెట్టాలన్నారు. మిరపలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 400 మి.లీ లేదా ఫ్లోనికామిడ్ 70 గ్రాములు లేదా అజాడిరాక్టిన్ 1500 పీపీఎం 1లీ చొప్పున ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట పోషక లోపాల ఒత్తిడిని తట్టుకొనుటకు పొటాషియం నైట్రేట్ 2 కిలోలు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. రబీ శనగ విత్తుకొనే రైతులు విత్తనాలను ముందుగా శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ వీఏఏ గోపీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

శనగ పంటలో తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముప్పాళ్ల: రబీ కాలంలో పండించే శనగ సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ బుధవారం తెలిపారు. తొలకరిలో భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండు సార్లు దున్ని చదును చేసుకోవాలన్నారు. ఎకరానికి 20 కేజీల చొప్పున కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా కలిపి విత్తుకుంటే తెగుళ్లు రావన్నారు. గాలి ద్వారా వ్యాపించే వేరుకుళ్లు, ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తుప్పు తెగులు వంటివి పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయని, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇనిమెట్ల వరి పొలాల్లో క్షేత్ర ప్రదర్శన



రాజుపాలెం: వరి పంటలో తెగులు ప్రధానంగా వాతావరణ మార్పుల ద్వారా గాలిలో తేమతో కూడిన వాతావరణం, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుందని వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని ఇనిమెట్లలో వరి పొలాల్లో క్షేత్ర ప్రదర్శన బుధవారం నిర్వహించారు. వరి పైరులో అక్కడక్కడ బ్యాక్టీరియల్ లీఫ్‌బ్లైట్(ఆకు ఎండు తెగులు) కనిపిస్తుందని, దీని నివారణకు నత్రజని ఎరువులను నియంత్రించి పొటాష్‌ను ఎకరాకు 15 నుంచి 20 కిలోలు లేదా ప్లోంటోమైసిన్ 20 నుంచి 40 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సీహెచ్ రూప, రైతులు పాల్గొన్నారు.

ఆటోని కారు ఢీకొని నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

శావల్యాపురం: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కనమర్లపూడి గ్రామం ఎస్సీ కాలనీకు చెందిన ఆటోలో పిడతల రమణ, మాలప్రోలు సువార్త, దేవరపల్లి శాంతిలు వినుకొండకు జీవనోపాధి నిమిత్తం బయలుదేరారు. ఈక్రమంలో నకరికల్లు మండలం నర్సింగపాడు నుంచి వినుకొండకు కారులో కుటుంబ సభ్యులతో ఏరువా గోవిందరెడ్డి వస్తూ కనమర్లపూడి వద్ద వినుకొండ వైపు వెళుతున్న ఆటోను అతివేగంతో ఢీకొంది. ఈ ఘటనలో ఆటో పల్టీలు కొట్టి ముళ్లకంపల్లోకి దూసుకుపోయింది. దీంతో ఆటోలో ఉన్న నలుగురు చెల్లాచెదురుగా పడిగాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వినుకొండ వైద్యశాలకు తరలించారు. కారు డ్రైవరు నిద్రమత్తు వల్లే ఈప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తుళ్ళూరి తిరుపతిరావు తెలిపారు. ఈప్రమాదంలో ఆటో డ్రైవరు పిడితల వెంకట్రావు, పిడితల రమణ, సువార్త, శాంతికి గాయాలయ్యాయి.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో 63వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయి సచ్చరిత్ర పారాయణం 51 మంది ఉపాధ్యాయులు సంపూర్ణ గ్రంథ పారాయణం చేశారు. నివేదన హారతి, దీపాల అలంకరణ చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఆరాధన మహోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

సత్తెనపల్లి వాసి కేరళలో మృతి



సత్తెనపల్లి: భార్యకు చికిత్స చేయించేందుకు వెళ్లి భర్త గుండెపోటుతో కేరళలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏలూరి శివరామ బ్రహ్మం (53) తన భార్య కల్పనకు చేతుల ఎముకల నొప్పులు ఉండటంతో 15 రోజుల క్రితం భార్యతో కేరళలోని చోటా నిక్కర్ గ్రామంలో ప్రకృతి వైద్యానికి వెళ్లారు. ప్రకృతి వైద్య సేవలు పొందుతున్న క్రమంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో శివరామ బ్రహ్మం ఒక్కసారిగా గుండెల్లో నొప్పి అంటూ కుప్పకూలి మృతి చెందారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భవాని ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె అఖిల కొచ్చిన్‌లో విద్యనభ్యసిస్తుంది. తండ్రి గతంలో మృతి చెందగా, తల్లి, సోదరులు మృతి వార్త తెలియడంతో అమెరికా నుంచి ప్రయాణమయ్యారు. ఈ నెల 27న అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించం

టీడీపీ నేతలను హెచ్చరించిన వైఎస్సార్ సీపీ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని టీడీపీ నేతలను వైఎస్సార్ సీపీ నేతలు హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి రామాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రామాపురంలోని టీడీపీ నేతల చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుసునని, రెచ్చగొట్టే వ్యాఖ్యలను మానుకోవాలని హితవు పలికారు. పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేషరెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తే మీ అంతుచూస్తామని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరిస్తున్నారని, ఇప్పుడు మా ప్రభుత్వమే ఉంది, రేపు కూడా మా ప్రభుత్వమే వస్తుందని, మీలాగే మేమూ వ్యవహరిస్తే ఒక్క టీడీపీ నేత కూడా గ్రామాల్లో ఉండలేరన్నారు. టీడీపీ నేతలు ఒళ్లు దగ్గర పెట్టుకుని గ్రామాల్లో ఉండాలని, మరోసారి వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే మేమేంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. జోనల్ కమిటీ ఇన్‌చార్జి మాశెట్టి బుజ్జి మాట్లాడుతూ రామాపురంలో టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ఓట్లురావని తెలిసి ఆ పార్టీ నాయకులు బరితెగింపు పనులు చేస్తున్నారని, ఎంత అరాచకం చేసిన పుట్టగతులు ఉండవన్నారు. ఎంపీపీ కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీ కందుల జాను, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గద్దల వేదమణి, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో మెరుగైన సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ డి.అరుణ

పిడుగురాళ్లరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని పల్నాడు జిల్లా ఐసీడీసీ పల్నాడు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి.అరుణ అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీసీ పీడీ డి.అరుణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలహీనంగా జన్మించిన శిశువులపై శ్రద్ధ వహించాలన్నారు. బలహీనంగా ఉన్న పిల్లలకు తీసుకోవాల్సిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. జగనన్న గోరుముద్దను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో టి.ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పాపయారాధ్యుల విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ చేస్తున్న ధాన్యకటక విహారట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు

అమరావతి: సుమారు రెండు వందల ఏళ్ళ కిందట అమరావతి రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గురువు, ఆస్థాన పండితుడు బాలచాముండేశ్వరీదేవి ఉపాసనతో అమ్మవారి సాక్షాత్కారం పొందిన ములుగు పాపయారాధ్యుల విగ్రహాన్ని స్థానిక యోగాశ్రమంలో బుధవారం ఆవిష్కరించారు. ధాన్యకటక విహారట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు, పొన్నూరు భావన్నారాయణ సంస్కృత కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ నిష్ఠల సుబ్రమణ్యం చేతుల మీదుగా పాపయారాధ్యుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ బాలచాముండేశ్వరీదేవి నక్షత్ర మాలికా స్తోత్రం, శ్రీ దేవి భాగవతపురాణాన్ని తెలుగులోకి అనువదించిన మహనీయుడు పాపయారాధ్యుడన్నారు. అలాగే సంస్కృతాంధ్రములలో అనేక కావ్యాలను రచించిన మహా పండితుడన్నారు. డాక్టర్ నిష్ఠల సుబ్రమణ్యంను యోగాశ్రమ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కలువకొలను నరసింహమూర్తి, గ్రామ ఉపసర్పంచ్ నిమ్మా విజయసాగరబాబు, యోగాశ్రమ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు



అనధికారికంగా లేఅవుట్ వేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో గౌరి

నకరికల్లు: అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.నగేష్ హెచ్చరించారు. స్థానిక 57 సర్వేనంబర్‌లో రికార్డుల పరంగా ఉన్న ప్రభుత్వ భూమిలో లేఅవుట్ వేశారన్న విషయం మేరకు బుధవారం వీఆర్వో పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా లేఅవుట్ వేశారన్న సమాచారం మేరకు సిబ్బందిని పంపి వివరాలు సేకరించామని అన్నారు. ప్లాట్ల అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవన్నారు. కాగా సదరు సర్వేనంబర్‌లోని భూమిలో గతంలో భూసేకరణ జరిగిందని రెవెన్యూ అధికారులు, ఆ స్థలంలో వివాదం లేదని మాకు సంబంధించిందని కొందరు ప్రైవేటు వ్యక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పబ్లికేషన్‌పై సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాజకుమారి, పక్కన ఏఈఆర్వోలు

సత్తెనపల్లి: ఎన్నికల కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి అధ్యక్షతన బుధవారం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ప్రీ రివిజన్ యాక్టివిటీస్, డెత్, డూప్లికేట్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు అంశాలతో పాటు పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్, ఓటర్ల జాబితా పబ్లికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి పూజల్లో పాల్గొన్న మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: పట్టణంలోని సాంబశివనగర్‌లో విజయదశమిని పురస్కరించుకొని చలువ పందిరిలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం అమ్మవారి నిమజ్జనాన్ని పురస్కరించుకొని మంత్రి విడదల రజిని అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు వేదపండితులు ఆహ్వానం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, విడదల కమలేంద్ర, బైరా వెంకట కృష్ణ, బండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.